ప్రజాశక్తి
శుక్రవారం 08 డిసెంబర్ 2023 5 కర్నూలు

ఎన్నికల వేడి..!

- తుది ఓటర్ల జాబితా తయారీపై దృష్టి
- ఎన్నికల సిబ్బంది నియామకానికి చర్యలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

తెలంగాణలో ఎన్నికల పర్వం ముగియగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలైంది. ఇప్పటికే ఓటర్ల జాబితా తయారీపై ఎన్నికల సంఘం దృష్టి సారించింది. అలాగే ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే సిబ్బంది వివరాలను కూడా సేకరిస్తోంది. మరో వైపు అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రచారంలోకి కూడా వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నాయి. వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమయ్యే సిబ్బంది నియామకాలకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం నాయకులు లేఖను పంపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో గతంలో ఎన్నికల నిర్వహణలో పని చేసిన సిబ్బంది వివరాలను కూడా అందజేయాలని కలెక్టర్ జిల్లా ఉన్నతాధికారులకు కూడా ఆదేశాలు జారీ చేశారు. జనవరిలో ప్రకటించే తుది ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన కోసం జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో ఓటరు నమోదు, ఓటరు జాబితా తయారీపై ప్రత్యేక అధికారులు దృష్టి సారించారు. ఓటరు జాబితాలో దొంగ ఓట్లు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తొలగించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. బోగస్ ఓటర్ల తొలగింపు పేరుతో ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓటర్లను తొలగిస్తున్నారంటూ జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకొచ్చాయి. ఓటర్ల జాబితా తయారీలో ప్రభుత్వం నియమించిన వాలంటీర్లను భాగస్వామ్యం చేస్తున్నారని విమర్శలు కూడా పెద్ద ఎత్తున వచ్చాయి. వాలంటీర్లను ఓటర్ల జాబితా తయారీ నుంచి తప్పించాలని కూడా డిమాండ్ చేశాయి. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం, జనవరిలో ప్రకటించే తుది ముసాయిదా ఓటర్ల జాబితాలో ఎంత మంది పేర్లు గల్లంతయ్యాయో, కొత్తగా ఎంత మంది ఓటర్ల నమోదు చేశారనేది తెలియాల్సి ఉంది.

అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు ప్రచారంలోకి వెళ్లేందుకు వ్యూహరచన చేసుకుంటున్నాయి. ఇంకా ఈ పార్టీలో నుంచి పోటీ చేసే అభ్యర్థుల ఖరారు కాకపోయినప్పటికీ ప్రచారాలను చేపడుతున్నారు. అధికార వైసిపి సామాజిక సాధికార యాత్ర పేరుతో ఇటీవల పత్తికొండలో ప్రచారాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. డిసెంబర్‌లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి కర్నూలు జిల్లా పర్యటనకు రానున్నారు. ముఖ్యమంత్రి నిర్వహించే పర్యటన ఎన్నికల ప్రచారంలో భాగమేనని రాజకీయ విశ్లేషకులు



అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష టిడిపి 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో ఆయా నియోజకవర్గ నేతలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. చంద్రబాబు అరెస్టుతో ఆ పార్టీ నేతలు ప్రచారంలో దూసుకు వెళ్లలేక పోయారు. చంద్రబాబు నాయుడు గతంలో అరెస్ట్ అయిన నంద్యాల జిల్లాలో పర్యటన అనంతరం కర్నూలు జిల్లాలోని పాణ్యంలో పర్యటించాల్సి ఉంది. కాగా స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయి జైలుకు వెళ్లారు. ఇప్పుడు మరోసారి ఈ యాత్రను కల్లూరు నుంచి ప్రారంభించనున్నట్లు సమాచారం. కేంద్రంలో బిజెపి ఎన్‌డిఎ కూటమిలో భాగస్వామ్యంగా ఉన్న జనసేన రాష్ట్రంలో మాత్రం టిడిపితో జత కట్టడంతో కూడా కొంత గందరగోళ వాతావరణం నెలకొంది. ఇటీవల జిల్లాలో ఆ పార్టీలు నిర్వహించిన ఉమ్మడి సమావేశాల్లో పెద్దగా టిడిపి, జనసేన నాయకులు కలిసి రాలేదు. తూతూమంత్రంగానే ఈ సమావేశాలను నిర్వహించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఇక్కడ కూడా అనేక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్ఎస్ ట్యాంకు పగుళ్లకు మట్టిని నింపుతున్న అధికారులు

ఎస్ఎస్ ట్యాంకు పగుళ్లకు

మరమ్మతు పనులు

- గుత్తేదారుల నిర్లక్ష్యం వల్ల పగుళ్లు

ప్రజాశక్తి - హోళగుంద

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పగుళ్లు ఏర్పడినట్లు సమాచారంతో మరమ్మతు పనులు ప్రారంభించారు. గురువారం ఆర్‌డబ్ల్యుఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మల్లికార్జునయ్య మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముందు జాగ్రత్త చర్యగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఎస్ఎస్ ట్యాంకు ఎత్తుగా ఉండడం వల్ల నీటి సామర్థ్యం ఎక్కువ ఉండడం, అధిక స్లోప్ వల్ల పగుళ్లు ఏర్పడి ఉండవచ్చని చెప్పారు. ఇలాగే వదిలేస్తే గండి పడే ప్రమాదం ఉన్నందువల్ల వెంటనే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఎఇలు రామ్‌నీలా, లక్ష్మన్న, మురళీ, మనోహర్ ఉన్నారు

గుత్తేదారుల నిర్లక్ష్యం వల్ల పగుళ్లు

గుత్తేదారుల నిర్లక్ష్యం వల్ల సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పగుళ్లు ఏర్పడినట్లు మండల ప్రజలు పేర్కొంటున్నారు. అధికారుల చేతివాటం వల్ల నాణ్యత లేని పనులు చేపట్టడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడుతోందని చెబుతున్నారు. ఆదోని మున్సిపాలిటీ ద్వారా సరఫరా చేసే బసాపురం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు కూడా నాణ్యత లోపించడం వల్ల గండి పడిందని గుర్తు చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ ఏడాది వర్షాలు కురవకపోవడం తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిల్వ తగ్గిందని, రాబోయే వేసవిలో తాగునీటికి ఇబ్బంది కలుగకుండా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు.

రైతులకు అన్యాయం చేయకండి...

- రోడ్లలో భూములు కోల్పోయే రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి - రూ.830 కోట్ల జెజెఎం నిధులను సద్వినియోగం చేయండి
- జిల్లా పరిషత్ స్థాయి సంఘం సమావేశంలో జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

'జాతీయ రహదారుల్లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి. లేదంటే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. రైతులు మాతో బాధలు చెప్పుకుంటున్నారు. కనీసం మార్కెట్ విలువలో సగమైనా ఇచ్చి న్యాయం చేయాలి. లేదా రైతులతో చర్చించి వారికి న్యాయమైన పరిహారం ఇచ్చేలా చూడాలి' అని సంబంధిత అధికారులను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కోరారు. గురువారం జిల్లా పరిషత్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జడ్‌పి 1, 2, 3, 4, 6వ, 7వ స్థాయి సంఘాల సమావేశాలు జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన, 5వ సమావేశం పగిడ్యాల జడ్‌పిటిసి వి.దివ్య అధ్యక్షతన సిఇఒ నాసరరెడ్డి సమక్షంలో నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడారు. జెజెం నిధులు ఉన్నా ఎందుకు టెండర్లు పిలవడం లేదని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ప్రశ్నించారు. శ్రీశైలంలో నీరు ఇప్పటికే తగ్గుముఖం పట్టిందని తెలిపారు. హెచ్ఎన్ఎస్ఎస్ కింద ఎన్ని చెరువులు నింపారని ప్రశ్నించారు. ఆయకట్టు రైతులకు నీటి విడుదలపై సమాచారం ఇచ్చి సద్వినియోగం చేయాలని సూచించారు. అనంతరం జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఈఏడాది నీటి కొరత ఉందని, వరదలు చాలా తక్కువని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పినట్లు ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కర్నూలు జిల్లాకు జెజెఎం కింద కేటాయించిన రూ.830 కోట్లను అధికారులు టెండర్లు పిలిచి తాగునీటి సమస్య రాకుండా చూడాలని సూచించారు. అధికారులు కచ్చితంగా ఈ నిధులను సద్వినియోగం చేయాలని చెప్పారు. విద్యా శాఖకు ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, అవి పేద విద్యార్థులకు ఉపయోగ పడేలా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పిచికారి మందులపై అవగాహన కల్పించాలని చెప్పారు. లేదంటే ఎక్కువ మోతాదులు వాడి నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. గడివేముల జడ్‌పిటిసి ఆర్‌బి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... గతంలో చేసిన పనులకు బిల్లులు మంజూరు కాలేదని, ఇక కొత్త పనులు ఎలా చేయాలని ప్రశ్నించారు. ఇక కొత్తవి చేస్తే తమ ఆస్తులను అమ్ముకునే పరిస్థితి ఉందన్నారు. ఓర్వకల్లు జడ్‌పిటిసి రంగనాథ్ గౌడ్ మాట్లాడుతూ... గతంలో అడిగిన వాటికి ఈ సమావేశంలో అయినా సమాధానం ఉందా అని ప్రశ్నించారు. సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా ఉందన్నారు. జూపాడుబంగ్లా మండలంలో జగన్న కాలనీల్లో తాగునీటి సౌకర్యాలు లేవన్నారు. లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేందుకు ముందుకు రావడం లేదన్నారు. అధికారులు లబ్ధిదారులను ప్రోత్సహించాలని జడ్‌పి ఛైర్మన్ పాపిరెడ్డి సూచించారు. ఛైర్మన్ సిసి అశ్విని కుమార్, ఎఒ జితేంద్ర పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పి ఛైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని

'ఉన్నతి'ని సద్వినియోగం చేసుకోండి

- జెసి నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సెర్ప్ - ఉన్నతి మహిళలు ఎస్సీ, ఎస్టీ శక్తి ఆటో రిక్షా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెసి నారపురెడ్డి మౌర్య సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఎస్సీ మహిళలకు సెర్ప్ - ఉన్నతి మహిళా శక్తి ఆటో రిక్షా పంపిణీని జెసి నారపురెడ్డి మౌర్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన మహిళలు ఆసక్తి ఉన్న వృత్తుల్లో రాణించేందుకు ఉన్నతి పథకం చక్కగా ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలు డ్రైవింగ్‌లో ఎలాంటి భయమూ, ఆందోళనా లేకుండా పురుషులతో సమానంగా రాణించాలని చెప్పారు. పురుషులకు సైతం కష్టంగా అనిపించే ఆటో డ్రైవర్ వృత్తిని ఎంచుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ మహిళల ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఈ పథకం కింద వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని తెలిపారు. ఈ రుణాలను తీసుకున్న వారు వాయిదా పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుందని, ఈ పథకం కింద ఉన్నతి మహిళ శక్తి ఆటో రిక్షా పేరుతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సరికొత్త కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వైఎస్ఆర్ క్రాంతి పథకం, డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో పేద ఎస్సీ మహిళలకు ఉన్నతి (వడ్డీ లేని రుణం) పథకం ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ పొందిన 11 మంది మహిళలకు మొదటి విడత కింద బజాజ్ ఆటోలు (9 యూనిట్లు), అప్పే ఆటోలు (2 యూనిట్లకు) పూర్తి ధరలో 90 శాతం మొత్తాన్ని రుణంగా మంజూరు చేశారని చెప్పారు. 10 శాతం వాటా ధనం మహిళలు చెల్లించినట్లు తెలిపారు. రుణాల మొత్తం రూ.29,40,555 మంజూరు చేసి ఆటోలు పంపిణీ చేసినట్లు చెప్పారు. మహిళలు తీసుకున్న రుణాలు సక్రమంగా 48 కంతుల్లో చెల్లించాలని సూచించారు. పథక సంచాలకులు డిఆర్‌డిఎ-వైకెపి ఎన్.సలీం బాషా, ఏపీడీ శ్రీధర్ రావు, డిపిఎం (లైవ్లివుడ్స్) నర్సమ్మ, జిల్లా సమాఖ్య అధ్యక్షులు సీత బాయి, జిల్లా సమాఖ్య కోశాధికారి మాధవి, జిల్లా ఉన్నతి కోఆర్డినేటర్ కాశీశ్వరుడు పాల్గొన్నారు.

ఓటరుజాబితాలో తప్పులను సరి చేయండి

ఓటరు జాబితాలో ఉన్న తప్పులను వెంటనే సరి చేయాలని, స్వీప్ కార్యక్రమాలు జిల్లాలో చేపట్టాలని రాష్ట్ర అదనపు ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి హరేంద్ర ప్రసాద్ ఆదేశించారు. ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి నారపురెడ్డి మౌర్య కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి మాట్లాడారు. అక్టోబర్ 27 నాటికి జంక్ క్యారెక్టర్స్‌కు సంబంధించి 13 ఇళ్లకు సంబంధించినవి 77గా ఉన్నాయని తెలిపారు. ఫారం -8 ద్వారా 56 కరెక్షన్ చేసినట్లు చెప్పారు. ఫారం-7 ద్వారా 4 తొలగించిన తర్వాత 17 మిగిలి ఉండగా మరోసారి కొత్తగా ఒక 8 జంక్ క్యారెక్టర్స్ కలవడం వల్ల మొత్తం 25 జంక్ క్యారెక్టర్స్ మిగిలి ఉన్నాయన్నారు. వాటిని డిసెంబర్ నెల 12కి పూర్తి చేస్తామని వివరించారు. పది మంది కంటే ఎక్కువ ఓటర్లకు సంబంధించి కూడా త్వరలో ఎంక్వైరీ పూర్తి చేస్తామని తెలిపారు. డిఆర్‌ఒ కె.మధుసూదన్ రావు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

ఆటోలను అందజేసే కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న జెసి మౌర్య

పోటీలను ప్రారంభిస్తున్న కెవి సుబ్బారెడ్డి

మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్ : ఆనందానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని కెవి సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కెవి సుబ్బారెడ్డి, టిడిపి కోడుమూరు నియోజకవర్గ యువ నాయకులు బి.దస్తగిరి అన్నారు. గురువారం కర్నూలు మండలం గార్గేయపురంలో క్రిస్మస్ సందర్భంగా టిడిపి జిల్లా సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కెవి సుబ్బారెడ్డి, దస్తగిరి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు క్రీడాకారుల కీర్తిని జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తరింపజేస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కౌలుట్లయ్య, టిడిపి నాయకులు సురేష్, రామోజీ, ఆనంద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతే లక్ష్యం

- ఎమ్మెల్యే సహకారంతో మరింత ముందుకు : ప్రభుదాస్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్ : ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తానని కర్నూలు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కె.ప్రభుదాసు అన్నారు. డివిఎంసి మెంబర్‌గా బాధ్యతలు చేపట్టి నేటికీ ఏడాది పూర్తి కానున్న నేపథ్యంలో ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగనన్న పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎ హఫీజ్ ఖాన్ నేతృత్వంలో నగరంలో వాడవాడలా ఎస్సీ, ఎస్టీ కాలనీలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే సహకారంతో నగరంలోని 45వ వార్డు భగత్ సింగ్ నగర్లోని 118 సచివాలయం పరిధిలో రూ.35 లక్షలతో పార్కును అభివృద్ధి పనులను పూర్తి చేశామన్నారు. ఎస్సీ కాలనీలో 10 సంవత్సరాల పైబడి పెండింగ్లో ఉన్న పాత డ్రైనేజ్ కాలువను తొలగించి కొత్త డ్రైనేజీ, రోడ్డును రూ.5.50 లక్షలతో పునఃనిర్మించినట్లు చెప్పారు. భగత్‌సింగ్ నగర్‌లో కెసి కెనాల్ వెంట సుమారు 100 ఫీట్ల వరకు రక్షణ కల్పిస్తూ రూ. 9 లక్షలతో ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టామన్నారు. భగత్ సింగ్ నగర్ బోర్డు నుంచి కెసి కెనాల్ వరకు సుమారు 120 అడుగుల పొడవున రూ. 9 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. సుంకేసుల రోడ్డు పక్కన ఉన్న క్రిస్టియన్ స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా రెండు ఎకరాలు అదనంగా భూమిని కేటాయించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. తనకు వెన్నుదన్నుగా నిలిచిన ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్‌కు, సహకరించిన పలువురు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



మాట్లాడుతున్న ప్రభుదాస్

బాలికపై అత్యాచారానికి పాల్పడిన

నిందితుడిని కఠినంగా శిక్షించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలోని బాలికపై అత్యాచారానికి పాల్పడిన అల్లబకాష్‌ను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రామకృష్ణ, కల్లూరు మండల కార్యదర్శి కె.మధు డిమాండ్ చేశారు. గురువారం పెద్దపాడు గ్రామంలో బాధిత బాలికను సిపిఎం ప్రతినిధి బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9 సంవత్సరాల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన 60 ఏళ్ల వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పెద్దపాడులో బిసి సామాజిక వర్గానికి చెందిన దంపతులకు ముగ్గురు కూమార్తెలు ఉన్నారు. చిన్న కూతురైన 9 ఏళ్ల బాలిక బుధవారం సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన తర్వాత ఇంటి ముందు ఉన్న అల్లా బకాష్ అంగడికి వెళ్లి బీడీలు తీసుకొస్తావా అంటూ ఇంట్లోకి పిలుచుకొని వాకిలి వేసి అత్యాచారానికి పాల్పడడం దారుణమన్నారు. దీన్ని సిపిఎంగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇంతటి దుర్మార్గానికి పాల్పడిన అల్లా బాకాష్‌ను కఠినంగా శిక్షించాలని, ఇటువంటివి మళ్లీ పునరావృతం కాకుండా జిల్లా అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు అండగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు చిలకమ్మ, గోపి, పందిపాడు శీను, బొల్లవరం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత బాలికను పరామర్శిస్తున్న సిపిఎం బృందం

అల్లబకాష్‌ను కఠినంగా శిక్షించాలి : ఐద్వా

కర్నూలు కార్పొరేషన్ : పెద్దపాడు గ్రామంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన అల్లాబకాష్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు, జిల్లా ఉపాధ్యక్షులు కెఎస్.పద్మ, ఓల్డ్ సిటీ కార్యదర్శి బంగి పద్మ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాలికకు మెరుగైన వైద్యం ప్రభుత్వమే అందించాలని, అక్కనుండి దూరంగా మంచి విద్యాసంస్థల్లో చదివించాలని, ఆర్థికంగా చిదిగిపోయిన ఆ కుటుంబానికి ఆర్థిక సహకారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులకు అండగా ఉండి న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు.

అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యం : వైసిపి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్ : అభివృద్ధి, సంక్షేమం సిఎం జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమవుతుందని వైఎస్ఆర్ సేవా దళ్ జిల్లా అధ్యక్షులు, పార్టీ క్లస్టర్ - 2 ప్రెసిడెంట్ కేదార్ నాథ్, మాజీ మేయర్ బంగి అనంతయ్య అన్నారు. గురువారం నగరంలోని 17వ వార్డు లక్ష్మీ గార్డెన్స్-41 సచివాలయం పరిధిలో వార్డు కార్పొరేటర్ కైపా పద్మ లతా రెడ్డి ఆధ్వర్యంలో ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై పార్టీ జెండాను, సచివాలయం పరిధిలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని సూచించే డిజిటల్ డిస్-ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం కేదార్ నాథ్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సిఎం జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని, అందుకే ప్రజలందరూ మళ్ళీ ఎపికి జగనే ముఖ్యమంత్రిగా రావాలని కోరు కుంటున్నారని అన్నారు. కైపా పద్మలత రెడ్డి మాట్లాడుతూ లక్ష్మీ గార్డెన్స్-41 సచివాలయం పరిధిలో డిబిటి, నాన్ డిబిటి ద్వారా రూ.9 కోట్ల సంక్షేమం అందినట్లు చెప్పారు. బంగి అనంతయ్య మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు బూటకపు హామీలతో మళ్ళీ మన ముందుకు రాబోతున్నారని, గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో వైయస్సార్ సేవాదళ్ జోనల్ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి, అక్బర్ వలీ, రవి, రాము, సూర్య మోహన్, చందు, మధు, శేషు, వసంత్ కుమార్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహ సారధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు కేదార్‌నాథ్

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలోని 3వ వార్డు పరిధిలోని ఛత్రిబాగ్ మసీదు ముందర తెరచుకున్న మ్యాన్ హోల్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు మహమ్మద్ షరీఫ్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి మరమ్మతు చర్యలు చేపట్టాలన్నారు.

ఫైబర్ నెట్ షెల్టర్‌కు స్థలాన్ని పరిశీలించిన జెసి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : భారత్ నెట్ ఫేజ్-2 ప్రాజెక్ట్ ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాలేషన్ కోసం భూమి కేటాయింపు షెల్టర్ కోసం స్థలాన్ని కలెక్టరేట్ ఆవరణంలో జెసి నారపు రెడ్డి మౌర్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రాజెక్ట్ పరికరాలను భద్రపరుచుకోవడం కోసం సెంటు స్థలాన్ని కేటాయించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో వారి అవస రాలను దృష్టిలో ఉంచుకొని కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న సర్వే నెం.896/బి విస్తీర్ణంలో 1.50 సెంట్లను గుర్తించినట్లు తెలిపారు.

9, 10 తేదీలలో

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు : యుటిఎఫ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : ఈ నెల 9, 10వ తేదీలలో ఏలూరులో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటిల్ వెల్లడించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఏలూరు పట్టణంలో జరిగే రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ప్రస్తుతం విద్యారంగంలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించి తీర్మానించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి కూడా కక్షపూరితంగా ఉందన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో అన్ని విషయాలపై సమగ్రంగా చర్చించి ఉద్యమ ప్రణాళికను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు

వృద్ధులకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : నగరంలోని స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో వృద్ధులకు, వితంతువులకు రాజ్ కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి మహబూబ్ బాషా, ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ నాగ స్వామి నాయక్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు రత్న కుమారిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని పేర్కొన్నారు.

పారదర్శకంగా కెజిబివి నియామకాలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో చేపట్టిన కెజిబివి నియామకాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహించామని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కే వేణుగోపాల్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీలో మెరిట్ ఆధారంగా వచ్చిన వారిని మాత్రమే ఎంపిక చేశామన్నారు. ఎక్కడ ఇలాంటి అవినీతి అక్రమాలు చోటుచేసుకోకుండా నిర్వహించి పూర్తిస్థాయిలో మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి విజయ శంకర్

ప్రజలతో సోదరభావంతో మెలగాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - సి బెళగల్

పోలీసులు విధుల మాటున గర్వం వీడి ప్రజలతో సోదరభావంతో మెలగాలని కర్నూలు రేంజ్ డిఎస్‌పి కె.విజయ శంకర్ తెలిపారు. గురువారం బెళగల్‌లోని పోలీస్ స్టేషన్‌ను సిఐ మన్సూరుద్దీన్, ఎస్సై మన్మధ విజయ్‌ల సమక్షంలో డిఎస్‌పి తనిఖీ చేశారు. కేసుల పూర్వపరాలు, గ్రామీణ ప్రజల స్థితిగతులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. డిఎస్‌పి మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో సోదరభావంతో మెలిగి ఫిర్యాదుల పట్ల స్పందించి సత్వరన్యాయం అందించాలని కోరారు. అనంతరం సామాజిక న్యాయంపై గ్రామాల్లో అవగాహన సభలు పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. అవినీతి, అక్రమాలు, అశాంతిపైనా దృష్టి సారించాలని సూచించారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి - పత్తికొండ

ప్రజల ఆస్తులకు భద్రత లేని ఎపి భూహక్కు చట్టం 27/2023ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ పత్తికొండ న్యాయవాదులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ స్వార్థ ప్రయోజనాల కోసం అధికార పార్టీ కొత్తగా భూహక్కుల చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఈ చట్టం అమలుతో భూములపై యజమాని అభద్రతాభావానికి లోను కావలసి ఉంటుందన్నారు. భూములపై హక్కులు కల్పించేందుకు కోర్టుల పరిధి నుండి తప్పించడం మూలంగా టైటిల్ డీడ్ సెటిల్మెంట్ జడ్జిమెంట్ తప్పుదోవ పట్టే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రజలకు వారి ఆస్తుల హక్కులకు భంగం వాటిల్లకుండా కొత్తగా తీసుకువచ్చిన భూహక్కుల చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎల్లారెడ్డి, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ దామోదర ఆచారి, కోశాధికారి మహేష్, కార్యదర్శి రంగస్వామి, న్యాయవాదులు నారాయణస్వామి, బిటి.నాగేష్, బాల భాష, మధుబాబు, కాశీ విశ్వనాథ్, భాస్కర్, హరికృష్ణ, రాజ వర్ధనగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు



గోడపత్రికను విడుదల చేస్తున్న మీనాక్షినాయుడు

'పోరుబాట యాత్ర'కు సహకరించండి

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షినాయుడును కోరిన నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

తమ సమస్యల పరిష్కారానికి చేపట్టే వికలాంగుల హక్కుల పోరుబాట యాత్రకు సహకరించాలని అమ్మ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కమతం వెంకటేష్, జిల్లా అధ్యక్షులు కె.ఈరన్న, విహెచ్‌పిఎస్ అధ్యక్షులు బీసీ.నాగరాజు కోరారు. గురువారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు చేతులమీదుగా గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వికలాంగులకు రూ.6 వేలకు పింఛను పెంచాలని, వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. వికలాంగుల 4 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, ఇంటి స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కులను, చట్టాలను, రాయితీ, రిజర్వేషన్లు సాధన కోసం ఈనెల 8 నుంచి 11 వరకు ఆదోని డివిజన్ నుంచి ఎమ్మిగనూరు, గోనెగండ్ల, కోడుమూరు మీదుగా నాలుగు రోజుల పాటు 100 కిలోమీటర్లు వికలాంగుల హక్కుల పోరుబాట యాత్రను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. టిడిపి, వివిధ ప్రజాసంఘాల నాయకులను సంఘీభావం తెలపాలని కోరుతున్నట్లు తెలిపారు. సుధాకర్, బ్యాంకు నరసింహులు పాల్గొన్నారు.

వికలాంగులకు రూ.6 వేల పింఛను ఇవ్వాలి

- వికలాంగులకు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



మద్దతు తెలుపుతున్న సిపిఎం నాయకులు

వికలాంగులకు రూ.6 వేల పింఛను ఇవ్వాలని సిపిఎం నాయకులు కోరారు. వికలాంగుల సమస్యలు పరిష్కరించడంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. తమ సమస్యల పరిష్కారానికి మద్దతు ఇవ్వాలని గురువారం వికలాంగుల సంఘం జెఎసి, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు సిపిఎం కార్యాలయం (సుందరయ్య భవన్)లో సిపిఎం నాయకులను కోరారు. ఈ సందర్భంగా విహెచ్‌పిఎస్ నాయకులు మాట్లాడారు. వికలాంగుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి పరిష్కరించాలని కోరారు. అర్హులైన ప్రతి వికలాంగునికీ రూ.6 వేల సామాజిక పింఛను ఇవ్వాలని, త్రీ వీలర్స్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పోస్టుల్లో వికలాంగుల రిజర్వేషన్లు పాటించాలని కోరారు. వారికి న్యాయమైన 4 శాతం రిజర్వేషన్ ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థల్లో కల్పించాలని, వికలాంగుల చట్టం 2016 పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 9న వికలాంగుల హక్కుల కోసం 100 కిలోమీటర్ల పాదయాత్ర సందర్భంగా ఎమ్మిగనూరు వరకు వచ్చిన సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు గోవిందు, హనుమంతు సంఘీభావం తెలిపారు. విహెచ్‌పిఎస్ నాయకులు నాగరాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

'ఎన్‌టిఆర్ విగ్రహం కూల్చివేత సిగ్గుచేటు'

ప్రజాశక్తి - హొళగుంద

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు విగ్రహం కూల్చివేత సిగ్గు చేటని టిడిపి విమర్శించారు. గురువారం టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు హొళగుందలోని బస్టాండ్‌లో టిడిపి మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, మండల యూత్ నాయకులు మంజునాథ్ గౌడ్ మాట్లాడారు. బాపట్ల మండలం భర్తిపుడి గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహం కూల్చివేయడం దారుణమని తెలిపారు. ఓటమితో భయంతో వైసిపి నాయకులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కేవలం 6 నెలల్లోనే విగ్రహం కూల్చిన వారితోనే మళ్లీ అదే చోటే కొత్త విగ్రహం ప్రతిష్టాపన చేయిస్తామని తెలిపారు.

మట్కా ఓపెన్.. బతుకులు క్లోజ్...

- ఓపెనింగ్ ఊరుకోనివ్వదు.. క్లోజింగ్ నిద్రపోనివ్వదు... - మట్కా నిర్వాహకులతో పోలీసులు కుమ్మక్కు..?

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పల్లెల్లో పనులు తగ్గిపోయాయి. ఖాళీ సమయాన్ని ఎలా వినియోగించుకోవాలి. కూలి డబ్బులు ఎలా సంపాదించాలన్న ఆలోచనతో చాలా మంది మట్కా మాయలో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతంతో పాటు పట్టణ నడిబొడ్డున శ్రీనివాస్ భవన్ సర్కిల్, మున్సిపల్ కార్యాలయ ఆవరణ కేంద్రంగా మట్కా వ్యాపారం జోరుగా సాగుతోంది.

ఆదోని డివిజన్ సరిహద్దుగా ఉండడంతో ఈ ప్రాంతంలో పల్లెపల్లెకు మట్కా విస్తరించింది. ప్రధాన నిర్వాహకులు కర్ణాటక రాష్ట్రం సిరుగుప్పలో ఉంటూ ఆయా గ్రామాల్లో, పట్టణాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని మట్కాను నిర్వహిస్తున్నారు. మట్కా మహమ్మారి విస్తరిస్తోంది. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశ పెరిగాక యువత మట్కాలో కూరుకుపోతోంది. మట్కాలో రోజుకు రెండుసార్లు ఫలితాలు వస్తాయి. ఉదయం 10 గంటల్లోపు ఒకసారి, రాత్రి 12 గంటలకు వచ్చే ఫలితాల కోసం జూదరులు ఎదురుచూస్తుంటారు. ఈ డబ్బు ఎలా.. ఎప్పుడు... ఎక్కడ.. చేరవేస్తారన్నది అంతుచిక్కని ప్రశ్న...

మట్కా మత్తులో యువత జీవితాలను నాశనం చేసుకుంటోంది. మట్కాకు ఒకసారి బానిసైతే కుటుంబం పూర్తిగా నాశనమయ్యే దాకా బయట పడలేరు. పట్టణంలో చాలా ఏళ్లుగా మట్కా కొనసాగుతోంది. ఒక్క రూపాయి పెట్టుబడితో రూ.80 వస్తాయనే ఆశ వారిని మట్కా వ్యసనంలో కూరుకుపోయేలా చేస్తోంది. ఆర్థికంగా దిగజార్చుతోంది. ఆదోనిలో గతంలో అనేక సార్లు పోలీసులు మట్కా జూదంపై దాడులు నిర్వహించారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఇప్పటికీ మట్కా యథేచ్ఛగా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అనేక కంపెనీల పేర్లతో మట్కా నడుస్తోంది. స్థానికంగా ఉండే ఏజెంట్లు ముందుగా బెట్టింగ్ డబ్బులు కలెక్ట్ చేసుకుని, ఫలితాలు వచ్చాక నెంబర్ వచ్చిన వారికి డబ్బులు చెల్లిస్తుంటారు. ఇదంతా ముంబయి కేంద్రంగా నడుస్తోంది. పనులు, నిద్రాహారాలు మానుకొని సరైన నెంబర్‌ను తెలుసుకోవడం కోసం నానా లెక్కలు కడుతుంటారు. గెలిచిన వారు సులభంగా డబ్బులు వచ్చాయన్న సంతోషంలో మద్యానికి బానిసలవుతుంటే, ఓడిన వారు డబ్బులు కోల్పోయామన్న బాధలో మద్యానికి బానిసలవుతున్నారు. ఒకసారి రూ.100తో రూ.8 వేలు గెలిచినవారు, మరోసారి రూ.1000తో రూ.80 వేలు గెలవాలన్న ఆశతో, మరింత డబ్బును వెచ్చిస్తున్నారు. తర్వాత ఆశించిన డబ్బు రాకపోగా సర్వం కోల్పోయి ఖాళీ జేబులతో రోడ్డున పడుతున్నారు. చివరికి అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలూ, దొంగలుగా మారిన సంఘటనలూ జిల్లాలో ఉన్నాయి. అత్యధిక కమీషన్లు వస్తుండటంతో ఏజెంట్లు జూదరుల సంఖ్య పెరిగేలా చూస్తున్నారు.



28/08/23 to 02/09/23	62	24	22	12	99	60
04/09/23 to 09/09/23	18	29	25	19	18	51
11/09/23 to 16/09/23	95	77	69	37	81	12
18/09/23 to 23/09/23	57	32	03	70	95	54
25/09/23 to 30/09/23	78	60	10	06	28	39
02/10/23 to 07/10/23	68	33	00	45	52	01
09/10/23 to 15/10/23	75	37	67	26	90	89
16/10/23 to 21/10/23	67	90	95	44	35	72
23/10/23 to 28/10/23	67	75	39	73	77	93
30/10/23 to 04/11/23	04	83	08	51	41	00
06/11/23 to 11/11/23	74	28	31	40	**	**
13/11/23 to 19/11/23	**	**	**	**	**	**
20/11/23 to 25/11/23	53	53	51	98	48	70
27/11/23 to 02/12/23						

నియోజకవర్గంలోనే ఏజెంట్లు అధికం...

ఆదోని నియోజకవర్గంలో మట్కా డాన్‌లుగా చలామణి అవుతున్న వారు అనేకమంది ఉన్నారు. పట్టణంలో ఇద్దరు టూ పోలీసు స్టేషన్ పరిధిలో మట్కా డాన్లు ఉన్నారు. మండలం సరిహద్దు గ్రామాల్లో కొందరు మట్కా డాన్‌లుగా అవతారమెత్తి మట్కా నడిపిస్తూ కర్ణాటక సరిహద్దు గ్రామాలకు ఈ డబ్బును చేరవేస్తున్నారు. పోలీసులు దాడులు నిర్వహిస్తారనే సమాచారం వీరికి ఆ శాఖ నుంచే వస్తున్నట్లు విమర్శలున్నాయి. మట్కా బీటర్లకే నేరుగా పోలీసులు సమాచారం ఇస్తున్నారని అనుకుంటున్నారు. తిమింగలాలను వదిలేసి చిన్న బీటర్లను పట్టుకొచ్చి డబ్బులు సీజ్ చేస్తున్నట్లు కూడా విమర్శలున్నాయి. పోలీసు శాఖకు నెల మామూలు ముట్టచెబుతుండడం వల్లే దాడులు చేపట్టడం లేదని సమాచారం. మరోవైపు పట్టణానికి చెందిన కొందరు వ్యాపారులు ఆన్‌లైన్ ద్వారా మట్కా నడుపుతున్నారు.

పట్టణంలోని శ్రీనివాస భవన్ సర్కిల్, మున్సిపల్ కార్యాలయ ఆవరణం, మట్కార్ గేరి, ఇంద్ర నగర్, గౌలిపేట, చిన్నా మార్కెట్, మైనార్టీ కాలనీ, బోయ గేరి, హనుమాన్ నగర్, కిలిచిన పేట, కొత్తబస్టాండ్, మార్కెట్ యార్డు ప్రాంతాలతో పాటు పెద్దహరివాణం, ఇస్వి, బసాపురం, పెద్దతుంబలం, జాలమంచి, కుప్పగల్, ఆరేకల్, నాగలాపురం, చిన్నపెండేకల్ గ్రామాల్లో మట్కా జోరుగా కొనసాగుతోంది. కొందరు బీటర్లు ఎవరికీ అనుమానం రాకుండా హోటల్ వద్ద, బీడీ బంకుల వద్ద ఉంటూ మట్కా డబ్బులు చెల్లించేందుకు వచ్చే వారితో డబ్బులు చీటీలు తీసుకుంటారు. మరికొందరు ఫోన్‌లో వాట్సప్ ద్వారా నెంబర్లు పంపిస్తూ, డబ్బులు ఫోన్‌పే ద్వారా చెల్లిస్తున్నారు. ఈ మట్కా డబ్బులు ఎవరికి ఇస్తున్నారు..?, ఎక్కడికి పోతున్నాయి అన్నది మాత్రం ప్రశ్నార్థకం..?

మామూళ్ల మత్తులో ఖాకీలు

మండలంలోని గ్రామాల్లో మట్కా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా నడుస్తోంది. రోజుకు రూ.లక్షల్లో మట్కా వ్యాపారం నిర్వహిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఒక్క రూపాయికి రూ.100 వస్తాయనే అత్యాశతో అమాయకులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇంత నడుస్తున్నా పోలీసులు మాత్రం దొరికితేనే కేసులు పెడుతూ చేతులు దులుపుకుంటున్నారని విమర్శలున్నాయి.

రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించండి

- నాయకులకు విన్నవించిన కాలనీవాసులు

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళంలోని వైఎస్ఆర్ నగర్‌లో రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆ కాలనీవాసులు 'గడపగడపకు' వచ్చిన నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. గురువారం స్థానిక కటిక వీధి వైఎస్ఆర్ నగర్‌లో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కటిక వీధిలో విద్యుత్ స్తంభాలకు తీగలను ఏర్పాటు చేసి విద్యుద్దీపాలను వెలిగించాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, సర్పంచి పాల్ దినకరన్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఏ మేరకు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఇంకా అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఉప సర్పంచి తిక్కయ్య, అవతారం, చౌదరి బసవరాజ్, వడ్డే రాముడు, అబ్దుల్ సమద్, భీమేష్, శివ, రామకృష్ణ పాల్గొన్నారు.

నాయకులతో మాట్లాడుతున్న కాలనీవాసులు

ఉద్యోగాల కల్పనలో వైసిపి విఫలం

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలోని యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో వైసిపి ప్రభుత్వం విఫలం చెందిందని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ విమర్శించారు. గురువారం 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా ఆదోనిలోని బండిమెట్ట కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. యువగళం నిధి కింద నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పారు. మహిళలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తుందన్నారు. నాలుగున్నర ఏళ్లలో రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు ఏవో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత వైసిపి ప్రభుత్వంపై ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగావకాశాలు లేక వేరే రాష్ట్రాలకు తరలిపోవాల్సిన దుస్థితి ఉందన్నారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, మాజీ ఎంపిపి మురళీ, సాధిక్ వలీ, రాఘవరెడ్డి, ఇంద్రానగర్ వీరేష్, పెద్దతుంబలం శీను, నరసప్ప, బాబురావు, లక్ష్మీకాంత్ రెడ్డి, సురేష్, భరత్ కుమార్, ఈరన్న పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న గుడిసె ఆది కృష్ణమ్మ

శివ, సంజు (ఫైల్)

మద్యం మత్తులో

కొడుకును చంపిన తండ్రి

- రంగారెడ్డి జిల్లాలో సంఘటన

ప్రజాశక్తి - మంత్రాలయం

మద్యం మత్తులో ఒక వలస కూలీ సొంత కొడుకును చంపిన సంఘటన తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంత్రాలయం మండలం బూదూరు గ్రామానికి చెందిన లతమ్మకు జిల్లాలోని సి.బెళగల్ మండలం రంగాపురం గ్రామానికి చెందిన శివతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడ బిడ్డ ఉన్నారు. బతుకుదెరువు కోసం తెలంగాణాకు వెళ్లారు. రంగారెడ్డి జిల్లాలోని అమీర్‌పేటలో నివసిస్తున్నారు. బుధవారం రాత్రి చిన్న కుమారుడు సంజు (3)ను తండ్రి శివ తాగిన మైకంలో కొట్టి చంపినట్లు బంధువులు తెలిపారు. వలస వెళ్లిన శివ వివాహేతర సంబంధం పెట్టుకొని భార్య, పిల్లలను వేధింపులకు గురి చేస్తూ తన కుమారుని చంపాడని పేర్కొన్నారు. మహేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

జిల్లా ఏర్పాటుతోనే అభివృద్ధి

- ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ప్రాంత సమగ్రాభివృద్ధికి ఆదోని జిల్లా ఏర్పాటే మార్గమని ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎ.నూర్ అహ్మద్ తెలిపారు. గురువారం ఆదోనిలో ఆయన మాట్లాడారు. ఆదోని జిల్లా ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేయడం శుభపరిణామమని తెలిపారు. 2020లో ఆదోని జిల్లా సమితి ఏర్పాటు చేసి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని ధర్నాలు నిర్వహించి ఆదోని డివిజన్ ప్రజల గుండెల్లో ఆదోని జిల్లా ఏర్పాటుపై ఆశలు రేకెత్తించామని చెప్పారు. కరువు, వలసలు, నిరుద్యోగం, వెనుకబాటుతనంలో బీహార్‌ను దాటిపోయిన ఆదోని డివిజన్ ఏనాటికైనా జిల్లాగా ఏర్పాటు చేయక తప్పదన్నారు. జిల్లా ఏర్పాటు అయ్యేవరకు తమ పోరాటం ఆగదని వెల్లడించారు.

దిశా యాప్‌పై అవగాహన కలిగి ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - పత్తికొండ

ప్రతి మహిళ దిశ యాప్ గురించి అవగాహన కలిగి ఉండాలని పత్తికొండ ఎస్ఐ గోపాల్ అన్నారు. గురువారం పత్తికొండ మండలం జయంతండా గ్రామంలోని ప్రజలకు, మహిళలకు దిశా యాప్, మహిళలపై జరుగుతున్న అత్యాచారాల గురించి ఎస్సై వివరించారు. గ్రామంలో ప్రజలు ఎలాంటి గొడవలు పడకుండా సోదర భావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నూర్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం

- ఎంపిడిఒ కొండయ్య

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడానికి అధికారులందరూ సమన్వయంతో ముందుకెళ్లి ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేద్దామని ఎంపిడిఒ సివి.కొండయ్య సూచించారు. గురువారం మండలంలోని నగరడోనా గ్రామంలో పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామి ఆధ్వర్యంలో 'జగనన్నకు చెబుదాం' నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తెలిపి సమస్యలను పరిష్కరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని అధికారులు తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు ఎంపిడిఒ సూచించారు. ఎంఇఒ బాలనాయుడు, ఇఒఆర్‌డి బాలన్న, ఎపిఒ మాధవ శంకర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, హౌసింగ్ ఎఇ భవ్య పాల్గొన్నారు.

నగరడోనలో 'జగనన్నకు చెబుదాం'లో పాల్గొన్న అధికారులు

వంద శాతం హామీలు నెరవేర్చిన ఘనత జగన్‌దే

- మున్సిపల్ ఛైర్మన్ శాంత

ప్రజాశక్తి - ఆదోని

ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, వైస్ ఛైర్మన్ నరసింహులు, జెసిఎస్ కన్వీనర్ ఫయాజ్ తెలిపారు. గురువారం ఆదోనిలోని 23, 7వ వార్డుల్లో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పథకాల లబ్ధిని నేరుగా ఖాతాల్లో వేస్తూ దళారి వ్యవస్థ అంతమొందించి అవినీతి రహిత పాలన అందిస్తున్నారని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో ప్రజలకు 600 అబద్ధాల హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏ ఒక్క సంక్షేమ పథకం కూడా అందించలేదని విమర్శించారు. రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ ద్వారా రూ.371 కోట్లు పక్కదారి పట్టించారని తెలిపారు. 2024లో మళ్లీ వైసిపి అధికారంలోకి వస్తే రెట్టింపు పథకాలు ప్రజలకు అందజేస్తామన్నారు. వార్డు కౌన్సిలర్ ఉస్మాన్ బాష, వార్డు ఇన్‌ఛార్జీ కల్లుబావి గోవిందు, ఇక్బాల్ బాష, జావెద్, పర్వాత్ భాను, గణేష్ స్వామి, దాస్, మహదేవ, జయరామ్, రామాంజి, సూర్యప్రకాష్, నాగేంద్ర, భీమ్ సింగ్, బాబా పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

తూకం.. తూచ్..!

- తూకంలో చేతివాటం చూపుతున్న రేషన్ డీలర్లు, నిర్వాహకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఎలక్ట్రికల్‌లో 250 గ్రాములు చూపిస్తున్న కాటా

పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని కూడా దశలవారీగా దోచేస్తున్నారు. మండలంలోని ఇస్వి గ్రామంలో ఎమ్‌డియు ఆపరేటర్ సెలవుల్లో ఉండడంతో స్థానిక డీలర్, హెల్పర్లతో ఎలక్ట్రానిక్ కాటాలో 250 గ్రాముల తక్కువతో రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు అందజేశారు. దీనిపై స్థానిక యువకులు ప్రశ్నించి, విఆర్‌ఒకు సమాచారం ఇవ్వడంతో ఫోన్ ద్వారా డీలర్లకు చెప్పి మరీ రేషన్ బియ్యాన్ని బంద్ చేయించారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని 250 గ్రాముల తక్కువగా అందిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. అసలే నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇది చాలదన్నట్లు వ్యాపారుల మోసాలతో సామాన్యుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. బియ్యం తూకాల్లో మోసాలకు పాల్పడుతూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటుండగా, సామాన్యులు మోసపోతున్నారు. తూకాల్లో మోసాలకు సంబంధిత తూనికలు, కొలతల శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో బియ్యం వ్యాపారుల దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. ఈ తరహా మోసాలను సహజంగా ఎవరూ పసిగట్టరు. బియ్యం వ్యాపారులు ఇచ్చిందే, చెప్పిందే నిజమని నమ్మేస్తారు. ఇలా కొన్నేళ్లుగా నమ్ముతూ వారి చేతుల్లో మోసపోతూనే ఉన్నారు జనం. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

9న విజయవాడలో ధర్నా : డిటిఎఫ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 9న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నట్లు డిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజ్ గౌడ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు, బందేనవాజ్ తెలిపారు. గురువారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజ్ గౌడ్ మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న 84, 85, 117, 128 జిఒలను రద్దు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న 20 వేల ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ 2023 ద్వారా భర్తీ చేయాలని, కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల నిర్వహణ నిధులను మంజూరు చేయాలని, సర్వీస్ రూల్స్ అమలు చేసి జిఒ 223 రద్దు చేసి జూనియర్ లెక్చరర్స్, ఎంఇఒ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఎంటిఎస్ కింద నియామకమైన 1998, 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు సర్వీస్ ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా 1న జీతాలు చెల్లించాలని, నాడు-నేడు బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని కోరారు. డిటిఎఫ్ మండల బాధ్యులు రియాజ్ అహ్మద్, మల్లికార్జున, జ్ఞానోదయ నాయక్, ప్రభన్న, మంజుల పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిటిఎఫ్ నాయకులు

సి.బెళగల్ మండలంలో 'అవీ - ఇవీ'...

ప్రజాశక్తి - సి.బెళగల్

సి.బెళగల్ మండల కేంద్రంలో గురువారం పలు కార్యక్రమాలు జరిగాయి.

ఆటో పత్రాలను అందజేస్తున్న ఎంపిడిఒ

- 9వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 9, 10న ఏలూరులో జరగనున్నాయని, జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఏటి తిమ్మన్న, మండల నాయకులు హనుమన్న, మనోజ్ కుమార్, నరసయ్య, హనుమంతు, కిషోర్‌లు కోరారు.

- నేడు బెళగల్‌లోని పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసులు పేర్కొన్నారు.

- మహిళా శక్తి కింద వెలుగు ఉన్నతి అనుసంధానంగా బెళగల్‌కు చెందిన ఆర్.సుకన్యకు మంజూరైన త్రీ వీలర్ ఆటోను ఎపిఎం వెంకట స్వామి, ఎంపిడిఒ శ్రీనివాసులు అందజేశారు. ఆటో విలువ రూ.3,03,434 కాగా లబ్ధిదారుని వాటా రూ.33 వేలు, ప్రభుత్వం నుండి రూ.27434లను 48 నెలల్లో చెల్లించాల్సి ఉంటుందని వారు తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు : వైసిపి

ప్రజాశక్తి - నందవరం

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించినట్లు వైసిపి సీనియర్ నాయకులు కనకవీడు లక్ష్మీకాంత్ రెడ్డి, ముగతి విరుపాక్షి రెడ్డి, గ్రామ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. మండలంలోని టి.సోమాల గూడూరు గ్రామంలో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ముందుగా కార్యకర్తలతో కలిసి వైసిపి జెండాను ఆవిష్కరించి, అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ చేపట్టినట్లు తెలిపారు. అవినీతికి ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా, కుల, మత, ప్రాంత, వర్గ, పార్టీ తేడా లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. జెసిఎస్ కన్వీనర్ చాంద్, ఎంపిడిఒ దశరథ రామయ్య, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య స్వామి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

- రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

కర్నూలులో జరగనున్న ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య కోరారు. గురువారం రైతుసంఘం ఆధ్వర్యంలో గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 15, 16, 17న జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా 15న బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నరేంద్ర మోడీ తెచ్చిన మూడు నల్లచట్టాలను తిప్పికొట్టడంలో ఎఐకెఎస్ కీలకపాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఎఐకెఎస్ జాతీయ సమావేశాలు మొట్టమొదటిసారి కర్నూలులో జరగడం గర్వకారణమని తెలిపారు. మండలంలోని రైతులు, మేధావులు, విద్యావేత్తలు, రైతులు, ప్రజలు ఈనెల 15న జరిగే బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గోడపత్రికను విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

భవన కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

మిచౌంగ్ తుఫాను వల్ల ఉపాధి కోల్పోయిన కర్నూలు నగరంలోని రోజా వీధి భవన నిర్మాణ కార్మికులకు కర్నూలు కళాకారుల సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం నిత్యవసర సరుకులు గురువారం పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షులు బైలుప్పల షఫీయుల్లా, కళాకారుల సంఘం అధ్యక్షులు సయ్యద్ రోషన్‌అలీ, సిబి అజయ్ కుమార్, ది రూరల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షులు భత్తుల సంజీవ రాయుడు, రోజా వీధి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం.సుమలత తదితరులు కిరాణా సరుకులు కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎం.సుమలత మాట్లాడుతూ విపత్తు కాలంలో భవన నిర్మాణ కార్మికులకు కిరాణా సరుకులు అందజేసి చేయూతనిస్తున్న కర్నూలు కళాకారుల సేవా సంఘం అధ్యక్షులు బైలుప్పల షఫీయుల్లాను అభినందించారు. భవన నిర్మాణ కార్మికులు ఎం.రామస్వామి, గోవిందు, హనుమంతు, రాముడు, బొజ్జమ్మ, ఐలయ్య, వీరభద్రి, ఈశ్వర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఉన్నతి కింద ఆటోలను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ తదితరులు

ఎంపి టికెట్ ఎవరికో?

- టిడిపిలో పెరుగుతున్న ఆశావహులు
- అభ్యర్థి ఎంపికపై అధిష్టానం దృష్టి

నంద్యాల ఎంపి టికెట్ కోసం టిడిపిలో ఆశావహులు పెరుగుతున్నారు. ఎంపి టికెట్ ఎవరికి దక్కుతుందోనని ఉత్కంఠ నెలకొంది. అభ్యర్థి ఎంపికపై అధిష్టానం దృష్టి సారించడంతో పలు పేర్లు ముందుకు వస్తున్నాయి...

మాండ్ర శివానందరెడ్డి

నరసింహారావు

బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

ఏరాసు ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లాలో రోజు రోజుకూ రాజకీయ వేడి పెరుగుతోంది. ప్రతిపక్ష పార్టీగా ఉన్న టిడిపిలోనూ ఎన్నికల వాతావరణం మొదలైంది. ఈ సారి ఎలాగైనా గెలవాలనే ఆలోచనతో టిడిపి అధిష్టానం ముందుకు వెళుతోంది. దానికి తగినట్లుగా అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించింది. ఇటీవల నంద్యాల టిడిపి నియోజకవర్గ ఇంఛార్జిగా మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను అధిష్టానం నియమించింది. భూమా బ్రహ్మానందరెడ్డిని పక్కకు పెట్టి ఈ నిర్ణయం తీసుకోవడంతో భూమా అనుచరుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాజాగా నంద్యాల ఎంపి స్థానానికి అభ్యర్థిని వెతికే పనిలో టిడిపి అధిష్టానం పడినట్లు సమాచారం. నంద్యాల ఎంపి స్థానానికి టిడిపిలో పోటీ పెరుగుతుండటంతో ఈ సారి టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ నెలకొంది. తెలుగుదేశం పార్టీలో కొంత మంది నుంచి మళ్లీ మాండ్ర శివానంద రెడ్డి పేరు వినిపిస్తోంది. నందికొట్కూరుకు చెందిన మాండ్ర శివానంద రెడ్డి చాలాకాలంగా టిడిపిలో పనిచేస్తున్నారు. 2019లో నంద్యాల నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో అదనపు ఎస్పీ హోదాలో పనిచేసి, పదవీ విరమణ చేసిన అనంతరం టిడిపిలో చేరారు. క్రియాశీల కంగా ఉన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డికి సమీప బంధువు కూడా. నంద్యాల ఎంపీ సీటును మళ్లీ తనకు కేటాయించాలని ఆయన పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. టిడిపిలో ఈ సారి కొత్తగా మరికొందరి పేర్లు నంద్యాల ఎంపి టికెట్ ఆశించే అభ్యర్థులుగా వినిపిస్తున్నాయి. శిరివెళ్ల మండలం కోటపాడుకు చెందిన హైకోర్టు న్యాయవాది గోగిశెట్టి నరసింహారావు పేరు కూడా వినిపిస్తోంది. ఆయన చంద్రబాబు అరెస్టు ముందు రోజు నంద్యాలలో టిడిపిలో చేరారు. ఎంపి టికెట్ ఇస్తామన్న హామీతోనే ఆయన పార్టీలో చేరినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. బలిజ సామాజిక వర్గం నుంచి ఆయన పేరును అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. నంద్యాల పార్లమెంట్ పరిధిలో బలిజ సామాజిక వర్గ ఓటర్లు ఎక్కువగా ఉన్నారనే కోణం నుంచి ఆ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. మైనార్టీ ఓటర్లు ఎక్కువగా ఉన్నారనే ఆలోచనతోనే ఆ స్థానం నుంచి ఫరూక్‌ను టికెట్ ఇచ్చేందుకు నిర్ణయించినట్లు పార్టీ శ్రేణుల్లో చర్చ సాగుతోంది. ఆ మాదిరిగానే సామాజిక వర్గం ప్రాతిపదికగా నరసింహారావుకు టికెట్ ఇస్తారన్న ప్రచారం సాగుతోంది. మరో వైపు నంద్యాల ఎంపి టికెట్ కోసం బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. ఆ హామీతోనే త్వరలో ఆయన టిడిపిలో చేరనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. రాజకీయాల్లో సీనియర్ కావడంతో ఆయనకు ఎంపి టికెట్ ఇస్తారని పలువురు చెబుతున్నారు. మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి పేరును కూడా టిడిపి అధిష్టానం ఎంపి టికెట్ కోసం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. రాజకీయంగా సీనియర్ కావడంతో ఈ సారి ఆయనకు ఎంపిగా పోటీ చేసే అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. ఇలా పార్టీలో పలువురి పేర్లు ఎంపి టికెట్ కోసం వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా టిడిపి అధిష్టానం నుంచి ప్రకటన వచ్చేంత వరకూ నంద్యాల ఎంపి అభ్యర్థి ఎవరనేది వేచి చూడాల్సిందే.

మహిళలకు జీవనోపాధి కోసమే..

'ఉన్నతి - మహిళా శక్తి'

ఆటోలను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మహిళల జీవనోపాధి మెరుగుపరిచేందుకు 'ఉన్నతి–మహిళా శక్తి' పథకం కింద మహిళా లబ్ధిదారులకు ఆటోలు పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సామూన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఉన్నతి – మహిళా శక్తి పథకం కింద ఆటోలను పంపిణీ చేసి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డిలు ఆటో ర్యాలీని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జెసి మాట్లాడుతూ ఉన్నతి – మహిళాశక్తి పథకం కింద తొలివిడతలో ఎస్సి, ఎస్టీ నిరుపేద మహిళలకు ఈ ఆర్థిక సంవత్సరం వడ్డీ లేని రుణాల ద్వారా 9 మంది మహిళలకు ఆటోలు మంజూరు చేసి పంపిణీ చేయడం జరిగిందన్నారు. వెలుగోడు, అవుకు మండలాల మహిళల జీవనోపాదులు మెరుగు పరిచేందుకు ఉన్నతి కార్యక్రమం కింద ఆటోలు పంపిణీ చేశామని, లబ్ధిదారుల సబ్సిడీ వాటా పోను మిగిలిన మొత్తానికి ప్రతినెల తేలిక వాయిదా పద్ధతుల ప్రకారం 48 నెలల పాటు చెల్లించాల్సి ఉంటుందన్నారు. భవిష్యత్తులో మరి కొంతమంది ఔత్సాహిక మహిళా లబ్ధిదారులకు ఆటో యూనిట్ల పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోలకు లబ్ధిదారులు తప్పనిసరిగా బీమా చేయించాలన్నారు. ఉన్నతి పథకం కింద అందించిన ఆటోలను లబ్ధిదారులు చక్కగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు లబ్ధిదారుని ఆటోలో ఎక్కి ఆవరణలో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, ఏపిడీలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు. **అవుకు :** మండలంలోని గుండ్ల సింగవరం మెట్టుపల్లె గ్రామాలకు చెందిన ఇద్దరు మహిళలకు ఉన్నతి పథకం కింద సున్నా లేని వడ్డీ పథకం కింద రెండు ఆటోలను పంపిణీ చేసినట్లు వెలుగు ఏపీఎం గోపాల్ తెలిపారు. గుండ్ల సింగవరం గ్రామానికి చెందిన గోగు నాగేశ్వరి, మెట్టుపల్లి గ్రామానికి చెందిన నక్క దేవకుమారీలకు ఉన్నతి పథకం కింద రెండు ఆటోలను నంద్యాల కలెక్టర్ కార్యాలయం వద్ద కలెక్టర్ గారి ఆదేశాల మేరకు అందించడం జరిగిందని తెలిపారు.

మహిళలకు ఆటోలను అందిస్తున్న అధికారులు

భక్తుల రద్దీకనుగుణంగా ఏర్పాట్లు

- శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు

ప్రజాశక్తి - శ్రీశైలం

సమావేశంలో మాట్లాడుతున్న ఇఒ పెద్దిరాజు

శ్రీశైలంలో జరుగుతున్న కార్తీక మాసోత్సవాలలో భాగంగా మాసం చివరి ఆది, సోమవారాలలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని దేవస్థానం ఆయా సెక్షన్‌ల అధికారులను దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పెద్దిరాజు ఆదేశించారు. గురువారం శ్రీశైలంలోని స్థానిక కార్యాలయంలో ఆయా సెక్షన్ల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూలైన్లో ఉండేవారికి మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లు అందజేయాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్నదాన మందిరంలో మధ్యాహ్నం, సాయంకాలం అన్నప్రసాధన వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. భక్తులకు అవసరమైన మేరకు లడ్డు ప్రసాదాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. లడ్డు ప్రసాదాల కౌంటర్ల వద్ద భక్తులు అధిక సమయం వేచి ఉండకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాతాళ గంగలో స్నానాలు ఆచరించే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పాతాళగంగలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని చెప్పారు. క్షేత్ర పరిధిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ వారితో సంయుక్తంగా తగిన చర్యలు తీసుకోవాలని భద్రత విభాగాన్ని ఆదేశించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించుకునేందుకు గంగాధర మండపం వద్ద, ఉత్తరమాడ వీధుల్లో తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నెల 27వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వచ్చే ఏడాది జనవరిలో 12వ తేదీ నుండి 18 తేదీ వరకు రోజూ జరిగే సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లను పరిశీలించాలని చెప్పారు. బ్రహ్మోత్సవ కల్యాణానికి చెంచు గిరిజనులను ఆహ్వానించాలని సూచించారు.

ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు : పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలని ఆయా సెక్షన్ అధికారులను ఇఒ పెద్దిరాజు ఆదేశించారు. ప్లాస్టిక్ పదార్థాల నిషేధంపై స్థానికులకు, స్థానికేతరులకు వాటిపై అవగాహన కల్పించాలన్నారు. జనవరి 1వ తేదీ నుండి పూర్తిగా ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అసిస్టెంట్ కమిషనర్, పేద పండితులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, ఆయా శిక్షణ అధికారులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్, వసతి గృహాలకు ప్రహరీ నిర్మించాలి : కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పగిడ్యాల

ఎంఈఓ సుభాన్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులు

మోడల్ స్కూల్‌కు, వసతి గతృహానికి ప్రహరీ గోడ నిర్మించి విద్యార్థినులకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డక్క కుమార్ , కెవిపిఎస్ జిల్లా నాయకురాలు గంధం ఉశేనమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పగిడ్యాలలోని మోడల్ స్కూల్, వసతి గృహాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మోడల్ స్కూల్‌కు, వసతి గృహానికి ప్రహరీ గోడ లేకపోవడంతో బయటి వ్యక్తులు వస్తున్నారని, విద్యార్థినిలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి మోడల్ స్కూలు, కళాశాలలో చదువుతూ వసతి గృహంలో ఉంటున్న విద్యార్థినులకు ప్రిన్సిపల్, వార్డెన్ రక్షణ కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. సెలవు రోజుల్లో పాఠశాల ఆవరణకు అబ్బాయిలు అధికంగా వస్తున్నారని చెప్పారు. గతంలో సంక్రాంతి సెలవుల్లో తల్లిదండ్రులు ఇక్కడ వదిలిన ఒక అమ్మాయి బయటికి వెళ్లిపోవడం విచారకరమన్నారు. అమ్మాయిలు బయటికి వెళ్ళిపోతుంటే ప్రిన్సిపల్ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మోడల్ స్కూలుకు, వసతి గృహానికి తక్షణమే ప్రహరీ గోడ నిర్మించి, విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రిన్సిపల్, వార్డెన్లపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అంతరం ఎంఈఓ సుభాన్‌కు, తహశీల్దార్ భారతికి వేర్వేరుగా వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో వ్యకాస నాయకురాలు ఈశ్వరమ్మ, కెవిపిఎస్ నాయకురాలు జయమ్మ, ఎస్ఎఫ్ఐ నాయకులు అబ్దుల్లా, శేషు పాల్గొన్నారు.

అంగన్వాడీల వేతనాలు పెంచాలి

- అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - పాములపాడు

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు శివలక్ష్మి, నాగమద్దమ్మ, నాగమణి, శ్రీలత, జ్యోతి, నాగమ్మ, చెన్నమ్మలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పాములపాడులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12 నుండి సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నప్పటికీ అంగన్వాడీల వేతనాలు పెంచలేదన్నారు. ఇప్పటికైనా రూ. 26 వేలు వేతనం, బెనిఫిట్స్, జీతంలో సగం పెన్షన్, విధులు నిర్వహిస్తూ మరణించిన అంగన్వాడి వారి ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఈ నెల 12వ తేదీ నుండి చేపట్టేలో సమ్మెలో అంగన్‌వాడీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

మంత్రికి స్వాగతం పలుకుతున్న ఇఒ తదితరులు

మల్లన్న సన్నిధిలో దేవదాయ శాఖ మంత్రి

ప్రజాశక్తి - శ్రీశైలం

కార్తీక మాసం సందర్భంగా శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ముందుగా వీరు దేవస్థానం అతిథి గృహం వద్దకు చేరుకోగానే రెవెన్యూ అధికారులు, పోలీసులు, దేవస్థానం అధికారులు స్వాగతం పలికారు. ఆ తర్వాత స్వామి అమ్మ వార్ల దర్శనార్థమై ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్నారు. మంత్రికి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పెద్దిరాజు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, వేద పండితులు సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ఆ తర్వాత ముందుగా స్వామివారిని, అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : చైర్మన్

ప్రజాశక్తి-డోన్

ప్రజల సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. గురువారం డోన్ పట్టణంలోని కొండపేట 9వ సచివాల యం పరిధిలోని 14,15 వార్డుల నందు ' వై ఎపి నీడ్స్ జగన్' నిర్వహించారు. ముఖ్య అతిథిగా డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి పథకాలు అందించిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండి జాకీర్ హుస్సేన్,పట్టణ జేసీఎస్ కన్వీనర్ కురుకుంద హరి,కౌన్సిలర్లు టీఇ.లక్ష్మి,సుకన్య,సచివాలయ కన్వీనర్ శామ్, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

రైతులను దగా చేస్తున్న ప్రభుత్వం : టిడిపి

కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - విలేకరులు

బనగానపల్లె : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా వైసిపి ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శిం చారు. గురువారం మండలంలోని జోలాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ – భవిష్య త్తు గ్యారంటీ ప్రజావేదిక కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలుగా అతివృష్టి లేదా అనావృష్టితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూడు నెలలకు, ఆరు నెలలకు కొత్త కొత్త నిబంధనలు తీసుకురావడం, ఆ నిబంధనలు పేరిట సంక్షేమ పథకాలను ప్రజలకు దూరం చేస్తున్నారని విమర్శించారు. తెలుగుదేశం ప్రభుత్వం వస్తే అన్నదాత పథకం ద్వారా రైతుకు సంవత్సరానికి 20,000 రూపాయల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, టిడిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యులు గంధం హుసేని, టిడిపి నాయకులు తలారి తిరుమలయ్య, నాగరాజు యాదవ్, గుడిపాటి రమణ, నాగేశ్వర రావు, తలారి హరికృష్ణ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగాలు : బిసి ఇందిర

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు వారి భవిష్యత్తు బాగుంటుందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా పేర్కొన్నారు. పట్టణంలోని కరెంట్ ఆఫీస్ ఏరియాలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. కాలనీకి వచ్చిన బిసి ఇందిరాకు టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కార్యకర్తలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ని ఎంతో కృషి చేశారని, రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, టిడిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కష్ణా నాయక్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు,ముస్లిం మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, మండల కోశాధికారి ఖాదర్, వార్డు మెంబర్ లాయర్ నాగేంద్రరెడ్డి, నాయకులు టిప్ టాప్ కలాం, చంద్రారెడ్డి బొబ్బల మద్దిలేటి రెడ్డి, మహేశ్వర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి మురళీమోహన్ రెడ్డి, దివాకర్ రెడ్డి, ఆర్సీ నాగిరెడ్డి ,తప్పేట ప్రసాద్ ,యాగంటి పల్లె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. **మిగతా 6వ పేజీలో..**



బిసి ఇందిరాకు స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

9న చెంచులక్ష్మి సమేత పావన నరసింహస్వామి కళ్యాణం

ప్రజాశక్తి - బనగానపల్లె

ఈనెల 9న పట్టణంలోని రవ్వలకొండ మీద ఉన్న శ్రీచెంచులక్ష్మి సమేత పావన నరసింహస్వామి దేవాలయంలో చెంచులక్ష్మితో నరసింహస్వామి కళ్యాణము నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి బాలిశెట్టి పావన నరసింహమూర్తి గురువారం తెలిపారు. ఉదయం 9:30 గంటలకు దేవస్థానంలో చెంచులక్ష్మి పావన నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యములో నిర్వహిస్తున్నామని, భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

శ్రీరంగాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివ మోహన్ మాట్లాడుతూ 142 మందికి వైద్య సేవ అందించామన్నారు. ఇందులో రక్త పరీక్షలు, బీపీ, షుగర్, జ్వరము, జలుబు, గర్భిణులకు వైద్య సేవలను అందించి మందులు పంపిణీ చేశామ న్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పౌష్టికాహారం తీసుకోవాలని సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ వైద్య శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పి శ్రీలత, ఏఎన్ఎం లక్ష్మి, డీఈవో ప్రశాంత్, ఎం పి హెచ్ ఈ భాష ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా - వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ప్యాపిలి

ప్యాపిలి మండలంలోని అలెబాద్ వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. మల్యాల గ్రామానికి చెందిన వ్యక్తులు ఆటోలో 11 మంది కాశిరెడ్డి నాయన సీతారామపురంకు వెళ్లారు. తిరిగి వారిగ్రామానికి వెళుతుండగా అలేబాద్ మలుపు దగ్గర అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో బోయచంద్రప్ప (54)కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో 8 మందికి గాయాలయ్యాయి. బోయ చంద్రప్పను కర్నూలుకు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆయనకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని బైరెడ్డి నగర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం సలీంబాషా తెలిపారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి నగర్ కాలనీలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్ పెరుమాళ్ళ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ మద్దిలేటి ఆచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

9న జిల్లా స్థాయి చదరంగం పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన హనీఫ్ నగర్‌లోని రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో నంద్యాల జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ గురువారం తెలిపారు. ప్రతిభ చూపించిన వారి నుండి విజయవాడ, తిరుపతిలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా జట్లు ఎంపిక చేయడం జరుగుతుం దని, వివరాలకు 9010451585 ద్వారా సంప్రదించాలని తెలిపారు.

బ్రోచర్ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్ తదితరులు

పారదర్శకంగా పథకాల అమలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు నడుస్తుందని, ప్రతి వార్డు సచివాలయం పరిధిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ప్రత్యక్షంగా పారదర్శకంగా అందుతున్నాయని ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 36వ వార్డు సచివాలయం పరిధిలో వార్డుకు పోదాం కార్యక్రమం కౌన్సిలర్ నాగిని రవి సింగా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమం గురించి, అలాగే వార్డు పరిధిలో లబ్ధిదారులకు అందిన పథకాల నగదు వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎంగా మళ్ళీ జగనన్న ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ దాల్ మిల్అమీర్, వార్డు వైసిపి నాయకులు విజయశ్వర రెడ్డి, జయప్రకాశ్ రెడ్డి, వెంకట్ రెడ్డి 36వ వార్డు కన్వీనర్ పూర్ణమ్మ లోహిత్ రెడ్డి, ఆంజనేయులు, శ్రీరాములు, ఆలమూరు రవి, రాజు, పుల్లయ్య సచివాలయ సిబ్బంది వార్డు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - బేతంచర్ల

కర్నూల్‌లో జరిగిన సౌత్ ఇండియన్ కరాటే ఛాంపియన్స్ గేమ్‌లో బేతంచెర్ల మండలం గొరుమానుకొండ సమీపంలో గల మోడల్ స్కూల్ విద్యార్థులు మధు, భార్గవి, పరిమళ, ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురువారం నాడు ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

శాంతిరాంలో ఓరియంటేషన్ తరగతులు

ప్రజాశక్తి - పాణ్యం

శాంతి రాం ఫార్మసీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారం నాడు ఓరియంట్ క్లాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ డాక్టర్ ఎం శాంతి రాము హాజరై మాట్లాడారు. విద్యార్థులు కళాశాలలో ఉన్న పరిశోధన శాలలను ఉపయోగించుకొని వివిధ రకాల ప్రయోగాల ద్వారా నూతన ఆవిష్కరణలు చేయాలని తెలిపారు. అనంతరం కళాశాల టీం డాక్టర్ డివి అశోక్ కుమార్, ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన డాక్టర్ ఎం సిద్దయ్య, అన్నమయ్య జిల్లా కోల్డ్ చైన్ ఫార్మసీ ఆఫీసర్, డాక్టర్ జి కృష్ణరావు, శాంతిరా మెడికల్ కాలేజ్, జనరల్ హాస్పిటల్ డీన్ మాట్లాడారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

సైనికుల సంక్షేమానికి తోడ్పాటునందించాలి : జెసి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన సైనిక కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటునందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరాళాలను సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. గురువారం జెసి ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సైనిక ఉద్యోగుల సంక్షేమ అధికారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న డోన్ డిఎస్ పి వై శ్రీనివాసరెడ్డి

ఫ్యాక్షన్ జోలికి వెళ్లొద్దు : డిఎస్‌పి

ప్రజాశక్తి-డోన్

గ్రామాలలో ప్రజలు ఫ్యాక్షన్ జోలికి వెళ్ళకుండా ప్రశాంతంగా జీవించాలని డోన్ డిఎస్‌పి వై.శ్రీనివాసరెడ్డి ప్రజలకు సూచించారు. గురువారం డోన్ మండల పరిధిలోని పల్లె నిద్రలో భాగంగా డోన్ డి.ఎస్.పి వై.శ్రీనివాస రెడ్డి, డోన్ టౌన్ సీఐ కె.ప్రవీణ్ కుమార్, డోన్ రూరల్ ఎస్సై పి.సుధాకర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఫ్యాక్షన్ గ్రామం అయిన చనుగొండ్ల గ్రామంలో రాత్రి బస చేశారు. రాత్రి బసలో భాగంగా గ్రామ ప్రజలను సమావేశపరిచి వారితో మాట్లాడారు. ప్రజలు ఎప్పుడైనా,ఎక్కడైనా ఎలాంటి సమస్య ఉంటే పోలీసు స్టేషన్‌కు ఏ క్షణమైనా ఫోన్ చేయవచ్చు అని, స్టేషన్‌కి కూడా రావచ్చు అని సూచించారు. ఫ్యాక్షన్‌ను ప్రక్కన పెట్టి సామరస్యంగా అన్నదమ్ములు లాగ, సంతోషంగా ఉండాలన్నారుఉ. వచ్చే జనరల్ ఎలక్షన్‌లో మరే ఇతర ఎలక్షన్‌లలో అయిన ఎలక్షన్ వరకే పార్టీలు ఉండాలి తప్ప పర్సనల్‌గా వచ్చే సరికి గ్రామం, ప్రజలు అని ఉండాలని ప్రజలకు సూచించారు. పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట వేడుకలకు హాజరైన చల్ల విగ్నేశ్వర్ రెడ్డి

విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని పిక్కిళ్లపల్లె తాండ గ్రామంలో నూతనంగా నిర్మించిన మారెమ్మ తల్లి, సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ట వేడుకలు గురువారం ఘనంగా జరి గాయి. ముందుగా తండా ప్రజలు సాంప్రదాయంగా ఆలయం వద్ద ఉదయం నుంచి పూజలను నిర్వహించి విగ్రహాలను గ్రామ వీధులలో ఊరేగిస్తూ సాంప్రదాయ నృత్యాలను చేస్తూ నూతన ఆలయం వద్దకు చేరుకొని విగ్రహాలను ప్రతిష్టించారు. తాండ ప్రజల ఆహ్వానం మేరకు వైసీపీ నాయకులు చల్ల సూర్యప్రకాశ్ రెడ్డి, యువ నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డిలు ఆలయం వద్దకు చేరుకోగానే గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రత్యేక పూజలను నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మిషన్ జిఇఆర్
100 శాతం సర్వేపై ప్రత్యేక శ్రద్ధ

మాట్లాడుతున్న కలెక్టర్

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మిషన్ జిఈఆర్ 100 శాతం సర్వేలో భాగంగా బడి ఈడు పిల్లలందరూ బయట ఉండకుండా పాఠశాలల్లోనే వుండేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సూచించారు. గురువారం కలెక్టరేట్లోని వైఎస్ఆర్ సెంటినరీ హాలులో మిషన్ జిఈఆర్ 100 శాతం సర్వేపై జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, ఎంపిడీవోలు, ఎంఈఓలు, పాఠశాల హెడ్మాస్టర్లు, సిఆర్పిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే 100 శాతం పూర్తయిన తొలి జిల్లాగా నంద్యాల దేశంలో నమోదయిందని, ఈ మేరకు చిన్న చిన్న కారణాల వల్ల దీర్ఘకాలంగా బడికి వెళ్ళని బడి ఈడు పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలలకు పంపేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. పక్కా కార్యాచరణ ప్రణాళికతో బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్నారని ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తే జిఈఆర్ 100 శాతం సర్వే విజయవంతమై దేశంలోనే తొలి జిల్లాగా పేరొస్తుందని చెప్పారు. అనంతరం మండలాలకు నియమి ంచిన జిల్లా స్పెషల్ అధికారులు తమ అనుభవాలను పాఠశాల హెచ్ఎంలతో పంచుకొని చేపట్టాల్సిన అంశాలపై విశదీకరించారు.

కార్పొరేటు స్థాయిలో ప్రభుత్వ వైద్యశాలను అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రా రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆళ్లగడ్డ అభివృద్ధి సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అభివృద్ధి సలహా సంఘం చైర్మన్ అయిన ఎమ్మెల్యే గంగుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత మాట్లాడుతూ గత సంవత్సరం రూ. 2.25 లక్షలు, ప్రస్తుత సంవత్సరానికి రూ. 5 లక్షల నిధులు అంతా కలిపి రూ. 7.25 లక్షల నిధులు నిలువ ఉన్నాయని, ఈ నిధులతో ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేయాల్సిన వాటికి ప్రపోజల్స్ పంపించామన్నారు. డోనర్స్ ద్వారా వచ్చిన నిధులతో పాటు ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి సహాయ సహకారాలతో హాస్పిటల్‌లో మంచి వైద్య సేవలు అందించేందుకు ప్రయత్నిస్తున్నా మన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

కంప్యూటర్లు తదితర సామాగ్రిని కొనుగోలు చేస్తున్నామన్నారు. ఆసుపత్రిలో ఒక అనస్థీషియా, పీడియాట్రిక్, గైనిక్ డాక్టర్ అవసరం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారందరికీ మంచి వైద్యం అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. రూ. 20 లక్షల ఎంపీ నిధులతో కాంపౌండ్ వాల్, అంతర్గత రహదారులు ఏర్పాటు చేశామన్నారు. గుండె నొప్పి వచ్చినప్పుడు అత్యవసర చికిత్సగా రూ. 40 వేల విలువ చేసే ఇంజక్షన్ ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉందన్నారు. నాలుగు రోజుల క్రితం ఒక రోగికి గుండెపోటు రావడంతో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారని, వెంటనే ఈ ఇంజక్షన్ వేయడం ద్వారా ప్రమాదం నుండి కాపాడినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హాస్పిటల్ సూపరింటెండెంట్, డాక్టర్లు సిబ్బందితో కలిసి ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి అభివద్ధి సలహా సంఘం సభ్యులు దామోదర్ రెడ్డి, నాగేశ్వరమ్మ, రాష్ట్ర ఎన్జీవో సంఘం ఉపాధ్యక్షులు దస్తగిరి రెడ్డి, మున్సిపల్ ఏఈ సురేంద్ర, సీనియర్ డాక్టర్ తిరుపాల్, మున్సిపల్ వైసిపి ఇంచార్జ్ కూలూరు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం-ఆంధ్రా'

ప్రజాశక్తి - పగిడ్యాల

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారని జెడ్పిటిసి పుల్యాల దివ్య, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, ఎంపిపి మండ్ల మల్లేశ్వరి తెలిపారు. గురువారం మండలంలోని ఆయా సచివాలయాలకు ఆడుదాం-ఆంధ్రా క్రీడా సామాగ్రిని వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ఎంతో మంది క్రీడాకారులు ఉన్నారని, వారికి ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ క్రీడా పోటీల అవకాశాన్ని గ్రామీణ ప్రాంత క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటరమణ, ఇఒ ఆర్‌డి నాగేంద్రయ్య, ఎంఇఒ సుభాన్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా సామాగ్రిని పంపిణీ చేస్తున్న జడ్పిటిసి, ఎంపిపి

రైతులను దగా చేస్తున్న ప్రభుత్వం : టిడిపి

5వ పేజీ తరువాయి..

పాణ్యం : వచ్చే ఎన్నికల్లో ప్రజలు టిడిపికి పట్టం కట్టడానికి సిద్ధంగా వున్నారని పాణ్యం తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జి గౌరు చరిత అన్నారు. పాణ్యం మండల కేంద్రంలో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారంటీ అనే కార్యక్రమంలో గౌరు చరిత మాట్లాడుతూ తెలంగాణలలో మాదిరిగానే ఆంధ్రలోనూ ప్రజలు మార్పు కోరుకొని టిడిపిని అధికారం లోకి తీసుకొని రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు జయరామిరెడ్డి, రంగ రమేష్,రమణ మూర్తి, లాయర్ బాబు,జయసింహ రెడ్డి,శంకర్ రెడ్డి,గోవిందా గోవింద రెడ్డి,కుమార్ రెడ్డి, రామ పుల్లా రెడ్డి,వెంకటాద్రి, గుజ్జులా యల్లా సుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న గౌరు చరిత

టిడిపి - జనసేనల ప్రభుత్వం రావడం ఖాయం : ఇరిగెల

ఆళ్లగడ్డ : రానున్న ఎన్నికల్లో టిడిపి జనసేనల ప్రభుత్వం రావడం ఖాయమని తాలూకా జనసేన పార్టీ నాయకులు ఇరిగెల ప్రతాపరెడ్డి అన్నారు. గురువారం శిరివెళ్ళ మండల కేంద్రంలో స్థానిక భవిష్యత్ ష్యూరిటీ - ఇది బాబు పవన్‌ల గ్యారంటీ అనే కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులతో కలిసి పర్యటిస్తూ ఇంటింటికి తిరుగుతూ రాబోయే 2024 ఎన్నికల్లో టీడీపీ - జనసేనల ప్రభుత్వం వస్తే ప్రవేశ పెట్టే పథకాలను వివరించారు. అలాగే ప్రజలతో మమేకమై వైసీపీ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యే విధంగా ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పసుల నరేంద్ర, నాయకులు పెసర వాయి చాంద్ బాషా, ఆలమూరు గౌస్, పెసరవాయి గౌస్, చావిడి విశ్వనాథ్, గాజుల ఖుద్దుస్, ఆచారి తరుణ్, పఠాన్ ఇబ్రహీం, జబీబుల్లా, నాగరాజు, తేజనాథ్, మధు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఇరిగెల ప్రతాపరెడ్డి, నాయకులు

త్రీఫేస్ కరెంటు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డిగ్రీ కళాశాలకు త్రీఫేస్ కరెంటు : చైర్మన్

ప్రజాశక్తి-డోన్

డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఎంపీ లాడ్స్ కింద నాలుగు లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన త్రీఫేస్ కరెంటు సరఫరాను గురువారం డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లక్షల రూపాయల ఖర్చుతో ప్రారంభించిన ఈ పనులను కళాశాల పూర్వపు విద్యార్థి సీనియర్ న్యాయవాది నాగభూషణం రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించడం అభినందనీయమన్నారు. కళాశాలకు విద్యుత్ సరఫరా రావడంతో కొన్ని సంవత్సరాల పాటు నిరుపయోగంగా ఉన్న ప్రయోగశాలలు పరికరాలు డిజిటల్ క్లాసులు అందుబాటులోకి రావడం శుభ పరిణామం అని అన్నారు. అనంతరం డిగ్రీ కళాశాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు విద్యార్థులు ఆర్థిక శాఖ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బిల్లుడు దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం అటవీ రేంజ్‌లోని ముకుందాపురం గ్రామ సమీపంలోని చెరువు దగ్గర మూడు బిల్లుడు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ముకుందాపురం గ్రామ సమీపంలోని చెరువు దగ్గర మూడు బిల్లుడు దుంగలు అక్రమంగా నిల్వ ఉంచారని సమాచారం అందడంతో సిబ్బందితో ఆ ప్రాంతం లో సోదాలు నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా టైగర్ కార్డుపై రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న మూడు బిల్లుడు దుంగలను స్వాధీనం చేసుకు న్నామన్నారు. ఈ దాడుల్లో నూతల సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, బీట్ ఆఫీసర్లు రామకృష్ణ, నాగేంద్రయ్య, ప్రొటెక్షన్ వాచర్ దానమయ్య, అహెూబిలం, రుద్రవరం, ఆలమూరు, సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

కలపను స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ అధికారులు

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆత్మకూరు

వెలుగోడు మండలం మాధవరం గ్రామంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎండిఎఫ్ రూ. 6 లక్షల నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించినటుల తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, దేశం తిరుపం రెడ్డి, ఎంపిపి లాలం రమేష్, మాధవరం సర్పంచి ఆపతి బ్రహ్మానందరెడ్డి, ఏపీపీ ఆపతి భాస్కరరావు, ఎంపిటిసి మారంతుల ఈశ్వరమ్మ, మాధవరం శ్రీను పాల్గొన్నారు.



వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఉత్తమ ఆలోచనలతో ఉన్నత స్థానం

ప్రజాశక్తి - పాణ్యం

ఉత్తమైన ఆలోచనలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని కలకత్తాకు చెందిన ఇస్కాన్ సంస్థ ప్రతినిధి హరి ప్రభు పేర్కొన్నారు. ఆర్ట్ ఆఫ్ మైండ్ కంట్రోల్ అనే అంశంపై గురువారం ఆర్ జిఎం, శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాలల్లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైండ్ కంట్రోల్‌లో ఉన్నప్పుడే చదువులో విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగు తారని పేర్కొన్నారు. మానసిక ప్రశాంతత, ఆనందం, మితభాషత్వం, దురలవాట్లకు దూరము వంటి అలవాట్లతో పాటు ప్రతిరోజు యోగా అభ్యసించాల న్నారు. ఉన్నతమైన ఆశయాలు, ఉత్తమ ఆలోచనలు కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ఈ దశలోనే తమ జీవితాలకు సోపానాలు వేసుకోవాలని ఉన్నత స్థాయికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఇందుకోసం ఇటువంటి సదస్సులు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలలో ప్రిన్సిపాల్ లు డాక్టర్ జయచంద్ర ప్రసాద్, డాక్టర్ సుబ్రహ్మణ్యం కళాశాల డైరెక్టర్ అశోక్ కుమార్, హెచ్ఓడి లు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇస్కాన్ సంస్థ ప్రతినిధి హరి ప్రభు

కొండమీది గ్రామాలను మిగతా గ్రామాలతో పోల్చవద్దు : ఎంపిపి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని కొండమీది గ్రామాలను అవుకు మండలంలోని మిగతా గ్రామాలతో పోల్చవద్దు అని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురు వారం మండల పరిషత్ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి పాల్గొని వివిధ శాఖలకు చెందిన అధికారుల పనితీరుపై సభలో వివరించారు. గత సమావేశంలో జరిగిన తీర్మానాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అవుకు మండలంలో రిజర్వాయర్ ఎస్ఆర్బిసి కాలువలు ఉండటం వలన కొన్ని గ్రామాలకు పంటలు పండించుకునేందుకు త్రాగునీటి అవసరాలు తీర్చేందుకు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కొండమీద గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారులకు వివరించాలని తెలిపారు. మండలంలో 34 గ్రామాలు ఉంటే కేవలం కొండమీద ఆరు గ్రామాలు మాత్రమే తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అల్లాడుపోతున్నారని మిగతా గ్రామాలను కొండమీది గ్రామాలను సరి సమానంగా చూడటం సమంజసం కాదని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకొని వెళ్లి కొండమీది గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజల సమస్యలను వివరి ంచి నష్టపరిహారం అందేలా చూడాలని తాసిల్దార్ ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా మండలంలో అంగన్వాడి కేంద్రాల్లో పనితీరు సరిగ్గా లేదని ఇకపై పనితీరు మార్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

రోజులు లెక్కపెట్టుకుంటున్న జగన్మోహన్ రెడ్డి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు తరువాత అనేక అవాంతరాలను ఎదుర్కొని పార్టీ శ్రేణులకు, రాష్ట్ర ప్రజానీకానికి భరోసానిస్తూ తిరిగి మొదలుపెట్టిన యువగళం పాదయాత్ర అనూహ్యమైన ప్రజాదరణ వస్తున్న సందర్భంగా సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రజలు కట్టబెట్టిన అధికారానికి ఇంకా ఎన్ని రోజులు మిగిలున్నాయంటూ లెక్కపెట్టుకుంటున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాగడానికి నీళ్లు లేని పరిస్థితులలో రాయలసీమ ఉండగా టిడిపి హయాంలో దాదాపుగా పూర్తి అయిన అవుకు టన్నెల్‌ను సిఎం జగన్ ఏదో ఈ ప్రాంతానికి చేశానంటూ లేనిపోని డాంబికం ప్రదర్శిస్తూ నీళ్ల లేని సందర్భంలో జాతికి అంకితం చేయడం ఆయకే సాధ్యమయిందన్నారు. విత్తనం వేయాల్సిన సమయంలో కరువు తాండవం చేసి పంటలు పండక, ప్రజలు తాగడానికి నీరు లేక ఇబ్బంది పడుతుండగా ఇప్పుడు తుఫాను రూపంలో ఉన్న పంటలను నాశనం చేస్తూ ప్రకృతి కూడా జగన్ పాలనకు సహకరించట్లేదని చెప్పారు. కోస్తా ప్రాంత ప్రజలను మభ్యపెటాలని ప్రయత్నం చేసి విఫలమై జల వనరులపై (నాగార్జునసాగర్‌పై) ఉన్న అధికారాన్ని కేంద్రానికి పూర్తిగా అప్పజెప్పారని అన్నారు. కరువు మండలాల పరిస్థితులను కేంద్రానికి తెలియపరచకుండా ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం కరువు మండలాలకు చేస్తున్న ఆర్థిక సహాయాన్ని సైతం పాలనలో ఎటువంటి లోటుపాట్లు లేవంటూ చూపించుకునేందుకు కరువు మండలాల ప్రజలకు తీరని అన్యాయం చేస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శించారు.

మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి

విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎంపిపి

ప్రజారోగ్యానికి పెద్దపీట : ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచర్ల

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేసిందని బేతంచెర్ల ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం వారు అంబాపురం గ్రామంలో వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి, చలం రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైయస్సార్ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం వలన ప్రజలకు వైద్య సేవలు అన్నివేళలా అందుబాటులో ఉంటాయన్నారు. డాక్టర్లు భార్గవి, డాక్టర్ అబ్దుల్ అలీమ్, మేఘన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రాలు ఏర్పాటు చేయడం వలన ప్రజలకు వైద్య సేవలు అందించి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని, ఒకవేళ పరిస్థితులు తీవ్రమైతే మెరుగైన వైద్యం కోసం మండల కేంద్రంలోని శేషారెడ్డి సిహెచ్సి ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఒ అబ్దుల్ గఫార్ , రాజ్యలక్ష్మి, మహేశ్వరి, సింగల్ విండో అధ్యక్షులు రుద్రవరం నారాయణ, వైఎస్ఆర్సిపి నాయకులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోవిందపల్లెలో పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి - రుద్రవరం

సిరివెళ్ల మండలంలోని గోవిందపల్లె గ్రామంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా నాలుగవ వరి పంటకోత ప్రయోగం నిర్వహిం చినట్లు మండల వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన డి. చిన్న కాశన్న పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షణ అధికారిగా జిల్లా వ్యవసాయ అధికారి టీ.మోహన్ రావు హాజరయ్యారన్నారు. ఆయన సమక్షంలో ప్రయోగాన్ని5ఐ5 నిర్వహించామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి రైతులకు పంట నమోదు ఆవశ్యకతను గురించి వివరించారు. రబీ పంట నమోదు అందరూ రైతులు చేయించుకోవాలన్నారు. మందుల పిచికారి గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయ సిబ్బందిపాల్గొన్నారు.

పంట ప్రయోగంలో వచ్చిన దిగుబడి పరిశీలిస్తున్నఅధికారులు

మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందజేత

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో మున్సిపాలిటీలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుల కుటుంబాలకు మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, కమిషనర్ రవిచంద్ర రెడ్డిలు గురువారం పంపిణీ చేశారు. బసవయ్య కుటుంబానికి రూ.5 లక్షలు, అనారోగ్యంతో చనిపోయిన తులసిరాం కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల కుటుంబాలకు అండగా ఉండాలని వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చి మరణించిన కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాను ప్రకటించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిని సిఐటియు బృందంతో కలిసి యూనియన్ నాయకులు కోరగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కౌన్సిల్లో ఆమోదం పొంది కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు ఇచ్చినటువంటి ఎక్స్‌గ్రేషియాను చెక్ రూపంలో పంపిణీ చేశారన్నారు. అదేవిధంగా కుటుంబానికి అన్ని విధాలుగా వర్తించే బెనిఫిట్స్ సౌకర్యాలను ఇస్తామని ఆ కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడు కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, కే మహమ్మద్ గౌస్, జిల్లా ఉపాధ్యక్షుల తోట మద్దులు, జిల్లా కార్యదర్శి పి వెంకట లింగం, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, భాస్కరాచారి, నాయకులు రామకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్,కమిషనర్ తదితరులు

ప్రతి వస్తువుకూ బిల్లు తీసుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి-డోన్

వినియోగదారులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లులు తప్పకుం డా తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.తంగమని సూచిచంచారు. గురువారం డోన్ పట్టణంలోని సబ్ కోర్టు ఆవరణంలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్.తంగమని చేతుల మీదుగా వినియోగదారులు హక్కులు రక్షణలపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.తంగమని మాట్లాడుతూ నష్టపోయిన వినియోగదారులు మధ్య వర్తుల ప్రమేయం లేకుండా నేరుగా కన్స్యూమర్ కోర్టుకు వెళ్లి న్యాయం పొందాలని కోరారు.వినియోగదారులు నష్టపోకుండా చట్టాలను తెలుసుకో వాలని కోరారు. స్వచ్ఛంద సేవా సంస్థలు వినియోగదారులు నష్టపోకుండా చైతన్యం చేయాలని సూచించారు. వినియోగదారులకు బిల్లులు ఇవ్వని వ్యాపా రస్తులపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించా లని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డోన్ తాలూ కా వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ.నాగరాజు,సీనియర్ న్యాయవాది కానాల మహేష్, కార్యవర్గ సభ్యులు ధనుంజయ గౌడ్, మల్లికార్జున స్వామి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్.తంగమని

పగిడ్యాల: విద్యార్థులు నినాదాలు చేస్తున్న విద్యార్థులు

ఓటు హక్కు వజ్రాయుధం

ప్రజాశక్తి - పగిడ్యాల

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని తహశీల్దార్ భారతి, ఎంపిడిఒ వెంకటరమణ అన్నారు. గురువారం పగిడ్యాలలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోవాలని విద్యార్థులచే నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌ఒ, ఎంపిడిఒ మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పకుండా ఓటును నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ సుభాన్, పంచాయతీ కార్యదర్శులు, పాఠశాల హెచ్‌ఎంలు, విఆర్వోలు, విద్యార్థులు పాల్గొన్నారు. **పాములపాడు :** 2024 జనవరి 1కు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహశీల్దార్ రత్న రాధిక కోరారు. పాములపాడులో ఓటర్ నమోదు కార్యక్రమంపై విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపికృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ పటాన్ బాబు, వీఆర్వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాములపాడు : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు